క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: చందుపట్లగూడ 33/11కేవీలో విద్యుత్ సబ్‌స్టేషన్ అంకుషాపూర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఏఈ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. చందుపట్లగూడ, ఎదులాబాద్, మర్పల్లిగూడలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో స్పాట్ అడ్మిషన్స్

శామీర్‌పేట్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ ఈ విద్యా సంవత్సరానికి టీఎస్‌డబ్ల్యూఆర్ డీసీ డబ్ల్యూ జగద్గిరిగుట్టలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సు ప్రవేశ పెడుతున్నట్లు ప్రిన్సిపాల్ ఇష్రత్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ధ్రువపత్రాలు, అకాడమిక్ రికార్డులు, జిరాక్స్ కాపీలతో శామీర్‌పేట్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ డబ్ల్యూ వద్ద నిర్వహించే స్పాట్ కౌన్సెలింగ్, అడ్మిషన్ ప్రక్రియకు హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫోన్: 91210 04530.

ఘనంగా గణపతి హోమం



పోచారం: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శుక్రవారం గణపతి హోమం నిర్వహించారు. సమాజ శ్రేయస్సు కోసం గణపతి హోమం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మెరుగైన ప్రగతి సాధించేందుకు హోమం ఆచరించామన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు మెట్టు బాల్‌రెడ్డి, ఆకిటి శైలజ, సామల శ్రీలత, బాలగోని వెంకటేశ్ గౌడ్, బద్దం మమతా రాణి, సుర్వి సుధాలక్ష్మి, మోటుపల్లి పోచమ్మ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రషర్‌లతో ఇబ్బందులు

మేడ్చల్: గిర్మాపూర్‌లోని క్రషర్‌ల వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, క్రషర్‌లపై చర్యలు తీసుకోవాలని గిర్మాపూర్ గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలోని రోబో సాండ్, రాక్ సాండ్‌లలో నిర్వహించే కెమికల్ బ్లాస్టింగ్‌లు, అక్రమ బ్లాస్టింగ్‌లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని అరికట్టాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో దాసు, కృష్ణారెడ్డి, భాస్కర్, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అల్వాల్: లయన్స్ క్లబ్ ఆఫ్ అల్వాల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అల్వాల్ బాలాజీ ఆలయ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో జనరల్, దంత పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి కంటి అద్దాల కూడా పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'డబుల్'లో అవకతవకలపై విచారణ చేయాలి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఇటీవల జరిగిన డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల సర్వేలో అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ డిమాండ్ చేశారు. శనివారం పలువురు దరఖాస్తుదారులు సర్కిల్ కార్యాలయం చేరుకొని అధికారులను కలవడానికి ప్రయత్నించడంతో వారు నిరాకరించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న కార్పొరేటర్ శ్రవణ్ డీసీ చాంబర్ వద్దకు వెళ్లి నిరసన తెలియజేయడంతో డీసీ రాజు సర్వేలో అవకతవకలు జరిగాయని ఒప్పుకున్నారని అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశామన్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై ఫిర్యాదు

కుషాయిగూడ: హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తున్నట్లు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ బ్రాండ్‌ను మంటగలిపే విధంగా వ్యవహరిస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేగాకుండా కేంద్రమంత్రి సైనిక అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు వస్తున్న వదంతులను ఆయన ఖండించారు. ప్రజలను పక్కదోవ పట్టించేందుకు కుట్ర పన్నుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపిశెట్టి స్వామి, రామాంజనేయులు, పెప్పేటి శ్రీనివాస్, ముఖేష్, రమేష్, జూపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరిలో ఎవరికి..?

- ఢిల్లీకి చేరిన కాంగ్రెస్ తుది జాబితా..
- అందులో వారిద్దరి పేర్లు..
- ఫైనల్‌గా ఎవరికి టికెట్.?
- స్థానికంగా పెద్దఎత్తున చర్చ



సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి



తోటకూర జంగయ్య యాదవ్(వజ్రేష్)

మేడ్చల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం బరిలో కాంగ్రెస్ తరఫున పోటీలో ఉండే విషయంపై ఉత్కంఠ కొనసాగుతోంది. నియోజకవర్గంలో సీనియర్ నేతలుగా ఉన్న ఇద్దరు బలమైన నేతలు టికెట్ కోసం పోటీ పడుతుండగా వారి పేర్లతో తుది జాబితా ఢిల్లీకి చేరడంతో స్థానిక కాంగ్రెస్‌లో ఉత్కంఠ నెలకొంది. సీనియర్ రాజకీయనేత జెడ్పీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధిగా ఉన్న గౌడవెల్లికి చెందిన సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఓ పక్క, సీనియర్ నాయకుడు బోడుప్పల్ నివాసి టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్(జంగయ్య) మరోపక్క.. కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. గతంలో మేడ్చల్ కాంగ్రెస్‌కు ఎమ్మెల్యేగా పనిచేసిన కె.లక్ష్మారెడ్డి ఈ సారి ఎన్నికల్లో మేడ్చల్ నుంచి కాకుండా వికారాబాద్ జిల్లా తాండూర్ నుంచి, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నుంచి పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. మేడ్చల్ టికెట్ కోసం హరివర్ధన్‌రెడ్డి, జంగయ్యయాదవ్‌తో పాటు టీపీసీసీ బీసీ సెల్ అధ్యక్షుడు రాయ్యపల్లి మల్లేష్‌గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త సీనియర్ నాయకుడు ఏపీ సత్యనారాయణ దరఖాస్తు చేసుకున్నారు.

ఇద్దరూ చురుగ్గా పనిచేస్తూ..

మాజీ హోంమంత్రి దేవేందర్‌గౌడ్ అనుచరుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన జంగయ్యయాదవ్ బోడుప్పల్‌లో తిరుగులేని నాయకుడిగా ఎదిగాడు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి వెంట ఉంటూ కాంగ్రెస్‌లో చేరి టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నాడు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజారాజ్యం తరఫున, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున మేడ్చల్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి వెంట కాంగ్రెస్‌లో చేరి చురుగ్గా పని చేస్తున్నారు. ఇద్దరు నేతలు బలమైన నేతలు.. అన్నిహంగులు ఉన్న నేతలు, నియోజకవర్గంలో తమకంటూ ప్రత్యేక అనుచరులను ఏర్పాటు చేసుకున్నారు. ఏళ్లుగా రాజకీయంలో ఉంటూ తమస్థానాన్ని నియోజకవర్గంలో పదిలం చేసుకున్నారు. ఈ ఇద్దరూ టికెట్ కోసం రేవంత్‌రెడ్డిని నమ్ముకుని పని చేస్తున్నారు. టికెట్ తనదంటే తనదేననే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

◆ కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాలో మేడ్చల్‌లో ఇద్దరు పేర్లు ఫైనల్ అయినప్పటికీ ఇద్దరి మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో టికెట్ ఎవరిని వరిస్తుందోననే అంశంపై స్థానికంగా పెద్దఎత్తున చర్చ కొనసాగుతోంది.

తుది జాబితాలోకి వారి పేర్లు..

తాజా కాంగ్రెస్ స్క్రీనింగ్ లిస్టులో హరివర్ధన్‌రెడ్డి, జంగయ్యయాదవ్‌ల పేర్లు తుది జాబితాలోకి చేరాయని సమాచారం. ఎన్నో ఏళ్లుగా మేడ్చల్‌లో రాజకీయం చేస్తూ పార్టీలు మారినా తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హరివర్ధన్‌రెడ్డి, జంగయ్య చివరకు ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉంటూ రాజకీయం నడిపిస్తూ టికెట్‌ను ఆశిస్తున్నారు. 1999 ఎన్నికల్లో మేడ్చల్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయిన సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిగి నియోజకవర్గం నుంచి 2004 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత తిరిగి కాంగ్రెస్‌లో చేరి నగరంలోని హబ్సిగూడ కార్పొరేటర్‌గా కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మూడుచింతలపల్లి జెడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. తాజాగా టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళా మోర్చా నాయకులు

మేడ్చల్‌రూరల్: నూతన పార్లమెంట్ భవనంలో మొదటి బిల్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించడం మహిళలందరికీ గర్వకారణమని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు అమరం సరస్వతి, హంసారాణి అన్నారు. మహిళా బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం గుండ్లపోచంపల్లిలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మహిళలు స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న మహిళా బిల్లును ప్రధాని మోదీ ప్రభుత్వం నూతన పార్లమెంట్‌లో మొదటి బిల్లుగా ప్రవేశపెట్టి ఆమోదించడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తన పోరాటంతోనే మహిళా బిల్లు ప్రవేశపెట్టారనడం విడ్డూరంగా ఉందన్నారు. లిక్కర్ స్కాంను పక్కదారి పట్టించడానికి ధర్నా చేసిన కవిత, తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పుడు, మహిళా బిల్లు ప్రవేశపెట్టినప్పుడు పార్లమెంట్‌లో లేదన్నారు. మున్సిపల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు నవనీత, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు రవీందర్‌గౌడ్, అశోక్, త్రివేణి, సురేఖ, కవిత, సుహాసిని, రోజా, శోభారాణి, మహిళలు, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీసం వేతనం అవసరం



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర

ఘట్‌కేసర్: అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అదనపు భారం మోపకుండా కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో వెళ్లొద్దు.. ప్రమాదాల బారిన పడొద్దు



మాట్లాడుతున్న సీఐ హనుమాన్‌గౌడ్

మేడ్చల్‌రూరల్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రమాదాల బారిన పడొద్దని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ తెలిపారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహం, బస్‌డిపో, చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో అధికంగా నిబంధనలకు విరుద్ధంగా వాహనదారులు వాహనాలు నడుతుపున్నట్లు వివరించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో పాటు పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతోందన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ఎవరూ వాహనం నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు.

అపరిశుభ్రంగా మున్సిపాలిటీలోని పార్కులు



ఘట్‌కేసర్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని పార్కులను అభివృద్ధి చేయాలని బొక్కొనిగూడ నివాసి బొక్క రవీందర్‌రెడ్డి కమిషనర్ సాబేర్ అలీకి ఆయన కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. దత్తాత్రేయనగర్, సాయిసందీప్ కాలనీ పార్కులు అపరిశుభ్రంగా మారడంతో పందులు తిరుగుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. గతంలో కబ్జాకు గురైన పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేయించామని, అప్పటి నుంచి పార్కుల నిర్వాహణ గాలికొదలడంతో అపరిశుభ్రంగా మారాయన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.

రూ.3.43 కోట్లతో అభివృద్ధి పనులు

ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్ పర్సన్ పావనీజంగయ్య



ఘట్‌కేసర్ కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో రూ.3.43 కోట్లను ప్రతి వార్డుకు రూ.10 లక్షల చొప్పున కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి దీపాల కోసం రూ.50 లక్షలు, వినాయక నిమజ్జనం ఏర్పాట్లకు రూ.12 లక్షలు, రోడ్డు మరమ్మతులు, అంతర్గత మురుగు కాల్వలు, మోటారు మరమ్మతులు, సీసీ కెమెరాలు తదితర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధ, నస్రీన్‌సుల్తానా, నాగజ్యోతి, హేమలత శశికళ, మల్లేశ్, పద్మారావు, జహంగీర్, నరేశ్‌యాదవ్, నర్సింగ్‌రావు, రవీందర్, కోఆప్షన్ సభ్యులు సురేందర్‌రెడ్డి, షౌకత్, పి.అరుణ, బి.అరుణ, ఏఈ నరేశ్, ఆర్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జైళ్లశాఖ స్టాల్



స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఐజీలు రాజేష్, మురళిబాబు

కుషాయిగూడ: ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తుల స్టాల్‌ను తెలంగాణ జైళ్ల అధికారులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేశారు. స్టాల్‌ను జైళ్ల శాఖ ఐజీలు వై.రాజేష్, ఎస్.మురళిబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైల్ ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువగా చేసేందుకే ఈ స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైదీల్లో మార్పు కోసం అనేక సంస్కరణలు అమలు చేసున్నామన్నారు. ఖైదీలతో ఉత్పత్తులను తయారు చేయిస్తూ వారికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ వారిలో మానసిక చైతన్యం నింపుతున్నట్లు పేర్కొన్నారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లతో పాటు ఇతర రద్దీ ప్రాంతాలు, మార్కెట్లలో ఉత్పత్తును ప్రజలకు అందుబాటు ఉంచుతున్నట్లు తెలిపారు. జైళ్లశాఖ డిఐజీ డాక్టర్ డి.శ్రీనివాస్, చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్ల పర్యవేక్షణాధికారులు సంతోష్‌రాయ్, శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపంలో చోరీకి యత్నం



సీసీ కెమెరాల్లో రికార్డు అయిన చోరీ దృశ్యం



సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగిస్తున్న పోలీసులు

మేడ్చల్‌రూరల్: వినాయక మండపంలో దుండగుడు సెల్‌ఫోన్ల చోరీకి యత్నించగా మండల నిర్వాహకులు, పోలీసులు అప్రమత్తమై వెంబడించడంతో చోరీ చేసిన సెల్‌ఫోన్లతో సహా దుండగుడు తన వెంట తెచుకున్న ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలోని వినాయక మండపంలో గురువారం నిర్వాహకులు భరద్వాజ్, సాయి, లక్ష్మణ్, సచిన్ నిద్రిస్తుండగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు, ఓ కారు తాళాన్ని దొంగిలించాడు. వారికి మెళకువ రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. దొంగ పారిపోతుండగా దొంగిలించిన సెల్‌ఫోన్లు, తన బ్యాగ్, సెల్‌ఫోన్ కిందపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

హబ్సిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఎంతో అండగా నిలుస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. హబ్సిగూడలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేతులమీదుగా శుక్రవారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, వేముల సంతోష్‌రెడ్డి, గుడి మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చిన్నా, శ్రీధర్, మోహన్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పల్లా.. నాలుగెకరాలు కబ్జా

- మా భూమిలోకి వెళ్లనీయడం లేదు
- రౌడీలతో బెదిరించి.. అక్రమ కేసులు బనాయించి..
- చుట్టూ ప్రహరీ నిర్మించుకుంటున్నారు
- తాము కూడా బీఆర్ఎస్ నాయకులమే..
- పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేశాం..
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బాధితులు



స్థలం పత్రాలు చూపిస్తున్న బాధితులు

పంజగుట్ట: ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూకబ్జాల నుంచి కాపాడాలని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము కూడా బీఆర్ఎస్ నాయకులమే అని, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు ఎంతో కృషిచేశామని, కానీ మా సొంత భూములను తమ సొంత పార్టీ నాయకుడే కబ్జా చేస్తే ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కె.ప్రభాకర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, శివారెడ్డి మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామ పంచాయతీలోని వెంకటాపూర్ గ్రామంలో సర్వే నెంబర్–769లో తమకు మొత్తం ఆరున్నర ఎకరాల స్థలం ఉండేదని తెలిపారు. పక్కనే ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సంబంధించిన నీలిమ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి ఉందన్నారు. కాగా పల్లా రాజేశ్వర్‌రెడ్డికి భూమి కావాలి అంటే తమ ఆరున్నర ఎకరాల్లోంచి రెండున్నర ఎకరాలు విక్రయించామని తెలిపారు. కానీ రాజేశ్వర్‌రెడ్డి తన భూమితోపాటు మా మిగిలిన నాలుగు ఎకరాల్లో కూడా ప్రహరీ నిర్మించుకుంటున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే మీకు ఎంతోకొంత ఇస్తానని తీసుకుని వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా స్థలంలోకి వెళ్లనీయకుండా రౌడీలతో అడ్డుకుంటూ, పోలీసులతో అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాలుగు ఎకరాల స్థలనికి చెందిన పాస్‌బుక్‌లు, ధరణిలో తమ పేరు ఉండటంతో, రైతుబంధు కూడా వస్తోందని, తహసీల్దార్ కూడా ఆ స్థలం తమదే అని పత్రం ఇచ్చారని, అయినా స్థలంలోకి మమ్మల్ని వెళ్లనీయకుండా అధికారం ఉపయోగించి అడ్డుకుంటున్నారన్నారు. అక్కడున్న రేటుకు, అతను ఇస్తానన్న దానికి పొంతన లేదని, మంత్రి కేటీఆర్ స్పందించి తమ స్థలం తమకు ఇప్పించాలని వేడుకున్నారు.

రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

మేడ్చల్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాబోయే సాధారణ ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని, కలిసికట్టుగా సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అమయ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని బోగారం హోలీమేరీ ఇంజినీరింగ్ కాలేజీలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు(ఈఆర్వోలు), రిటర్నింగ్ అధికారులు(ఆర్వోలు), 16 మంది జిల్లా నోడల్ ఆఫీసర్లతో ఆయన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు ఎన్నికలకు ఎంత సిద్ధంగా ఉన్నారనే విషయాలపై ఆయన ఆరా తీశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను జిల్లావ్యాప్తంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర విషయాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. జిల్లాలో ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేలా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి త్వరలో జరిగే సమావేశానికి అధికారులందరూ సమగ్ర సమాచారం, పూర్తి వివరాలతో హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, కీసర, మల్కాజిగిరి ఆర్డీవోలు శ్యామ్‌కుమార్, రాజేష్‌మార్, రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని రాస్తారోకో



తూంకుంటలో రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శామీర్‌పేట్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం తూంకుంటలో రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ మాదిగ, కళా మండలి జాతీయ అధ్యక్షుడు ఎస్వై అశోక్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లుకు మోక్షం కల్పించినట్లుగానే పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ బిల్లుకు సైతం మోక్షం కల్పించి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి మాదిగల పట్ల తీవ్రమైన సామాజిక వివక్షత ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ కార్యకర్తగా పోరాడతా అని చెప్పిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మాదిగల వద్దకు వస్తాడని ప్రశ్నించారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన విరమింపజేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, నాయకులు శ్రీనివాస్, మహేందర్, రవి, సాయి, నవీన్, పరశురాం, నర్సింగ్‌రావు, రమేశ్, సునీల్‌రిషి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగాలి

నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



రాంపల్లి పాతచెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి పాతచెరువు వద్ద గణేష్ నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తదితరులు పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు రామకృష్ణానగర్‌కాలనీలో సుమారు రూ.6 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను వారు ప్రారంభించారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళలకు సన్మానం

ఘట్‌కేసర్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అవుషాపూర్‌లో పలువురు మహిళలు కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన వనజ, కృష్ణవేణి, జగదాంబ సేంద్రీయ పద్ధతిలో ఇంటికి సరిపోయే కూరగాయలను పండించి గ్రామంలోని మహిళలకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి, కార్యదర్శి సునీత శుక్రవారం వారి నివాసాలకు వెళ్లి కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి సన్మానించారు.

స్వచ్ఛత అవగాహన ర్యాలీ

శామీర్‌పేట్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తూంకుంట మున్సిపల్ కౌన్సిలర్ రాజ్‌కుమార్‌యాదవ్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. తడిపొడి చెత్త, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ మున్సిపాలిటీ, స్వచ్ఛ దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పర్యావరణ ఇంజినీర్ గణేశ్, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవుషాపూర్‌లో వనజను సన్మానిస్తున్న సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి, కార్యదర్శి సునీత



తూంకుంట విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కౌన్సిలర్ రాజ్‌కుమార్‌యాదవ్